సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం | 18 | జూన్ | 2025



వినతులు.. వేడుకోళ్లు

నష్టపరిహారం చెల్లించకుండా కొల్లేరులో జిరాయితీ, డీఫాం భూములలో చెరువులు ధ్వంసం చేశారని కొల్లేరు ప్రజలు సీఈసీ ముందు గోడు వెళ్లబోసుకున్నారు. 8లో ▸



కొందరికే 'తల్లికి వందనం'

'తల్లికి వందనం' నిరుపేద తల్లులకు అందకుండా పోయింది. పథకం అమలుకు సవాలక్ష నిబంధనలతో అంతిమంగా అర్హులకు మొండిచేయి చూపారు. 8లో ▸



తాడేపల్లిగూడేనికి ఎయిర్‌పోర్టు

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించే దిశగా అడుగులు పడుతున్నాయి. కేంద్రం నుంచి భూసేకరణకు ఉత్తర్వులు అందాయి. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌ను కలిసిన మురళీకృష్ణంరాజు



తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వంగా కలిసిన మురళీకృష్ణంరాజు

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో పార్టీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేసి ప్రజలను మోసగిస్తున్న తీరు తదితర అంశాలపై అధినేతతో చర్చించినట్టు మురళీకృష్ణంరాజు తెలిపారు.

కొల్లేరు వాసుల నుంచి వినతిపత్రాల స్వీకరణ

ఏలూరు(మెట్రో): కేంద్ర సాధికారిత కమిటీ కొల్లేరు ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మంగళవారం రాత్రి ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు మండలాలకు చెందిన పలువురు రైతులు, కొల్లేరు వాసులు, పర్యావరణవేత్తలు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించింది. కార్యక్రమంలో కమిటీ మెంబరు కార్యదర్శులు డా.జె.ఆర్.భట్, జి.భానుమతి, కమిటీ సభ్యులు సునీల్ లిమాయే, ప్రకాష్ చంద్రభట్‌లతో పాటు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు



సరితారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో మహిళలకు, యువతులకు రక్షణ లేకుండా పోయిందని, ఏకంగా సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలోనే మహిళలపై దౌర్జన్యాలు, దాడులు జరుగు తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి తెలిపారు. ఒక మహిళ హోంమంత్రిగా ఉంటున్నా మహిళలకు రక్షణ లేకపోవటం సిగ్గుచేటని, ఒక మహిళను పట్టపగలు నడిరోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళి చెట్టుకు కట్టేసి కొట్టడం దారుణమన్నారు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలపై ప్రభుత్వం స్పందించలేదని, కనీసం దోషులను అరెస్ట్ చేయలేదని, ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల కోసం శక్తి యాప్ పెట్టాం, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పుకునే కూటమి ప్రభుత్వం మహిళపై దాడికి పాల్పడినా ఏ విధమైన చర్యలు తీసుకోకపోవటం బాధాకరమని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

భీమవరం: జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం తెలిపింది. రాష్ట్ర ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా సాలా నరసయ్య (పాలకొల్లు), ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా బి.విజయరాం (నరసాపురం), ఎస్టీ సెల్ సెక్రటరీగా మేకల ఏడుకొండలు(తాడేపల్లిగూడెం), రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా పరిమి వెంకటేశ్వరరావు (తాడేపల్లిగూడెం), రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం సెక్రటరీగా ఎస్ఎస్ ప్రసాద్(తాడేపల్లిగూడెం), రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా మద్దా చంద్రకళ(పాలకొల్లు), రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా మారిశెట్టి శేషగిరిరావు(తణుకు), రాష్ట్ర కల్చరల్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఆకుల పాండుస్వామి(తణుకు), రాష్ట్ర వీవర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎస్.మల్లికార్జునరావు (పాలకొల్లు) నియమితులయ్యారు.

డీఎస్సీ పరీక్షకు 94 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 94.66 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 636 మందికి 615 మంది హాజరుకాగా మధ్యాహ్నం పరీక్షకు 581 మందికి 537 మంది హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

కొల్లేరులో జిరాయితీ పంచాయితీ

- అభయారణ్యంలో 77 వేల ఎకరాల భూములు
- కొల్లేరు ఆపరేషన్‌లో 31 వేల ఎకరాల్లో చెరువులు ధ్వంసం
- కాంటూరు పరిధిని గుర్తిస్తేనే సమస్యకు పరిష్కారం
- జిరాయితీ భూములపై హక్కు కల్పించాలని కొల్లేరు ప్రజల డిమాండ్
- కేంద్ర సాధికారత కమిటీకి వినతుల వెల్లువ
- నేడు కూడా జిల్లాలో కమిటీ పర్యటన



కైకలూరులో ఏర్పాటు చేసిన సభలో ప్లకార్డులతో కొల్లేరు గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కొల్లేరు ప్రాంతంలో కేంద్ర సాధికారత కమిటీ పర్యటన నేపథ్యంలో జిరాయితీ భూముల వ్యవహారం ప్రధానాంశంగా మారింది. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు స్థానికులకు జీవనోపాధితో పాటు భూములపై హక్కులు ఉండేలా చూడాలని వందలాది వినతులు వెల్లువెత్తాయి. ప్రధానంగా అభయారణ్యంలోని జిరాయితీ డీ-ఫామ్ భూములు మినహాయించాలని డిమాండ్ స్థానికుల నుంచి బలంగా వినిపించింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో కేంద్రం నియమించిన కేంద్ర సాధికారత కమిటీ మంగళవారం కొల్లేరు ప్రాంతంలో పర్యటించింది. కైకలూరు, ఉండి నియోజకవర్గాల్లోని కొల్లేరు ప్రాంతంలో పర్యటించి అభయారణ్యాన్ని, కొల్లేరు స్థితిగతులను పరిశీలించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొల్లేరును కాపాడండి- మమ్మల్ని కాపాడండి అంటూ పెద్ద ఎత్తున కొల్లేరువాసులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో 10వ కాంటూరు వరకు 2.25 లక్షల ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. 2004లో కొల్లేరు ఆపరేషన్ నిర్వహించి అక్రమ చేపల చెరువులను ధ్వంసం చేశారు. పేదల ముసుగులో బడా వ్యక్తులు, రాజకీయ నాయకులు అడ్డగోలుగా వేలాది ఎకరాల చేపల చెరువులు ఏళ్ల తరబడి సాగు చేసి వందల కోట్లు ఆర్జించారు. ఈ క్రమంలో ఆపరేషన్ కొల్లేరులో 31,120 ఎకరాల చెరువులను ధ్వంసం చేశారు. దీనిలో 14,932 ఎకరాల్లో జిరాయితీ భూములు, 5,510 ఎకరాల డీ-ఫాం భూములు, ఇతర కొల్లేరు అభయారణ్యం ఉంది. తదనంతరం కొల్లేరు అభయారణ్యంలో మొత్తంగా 77,138 ఎకరాల్లో జిరాయితీ, డీఫాం భూములు ఉన్నట్లు నిర్ధారించారు. 3 లక్షల జనాభా ఉన్న కొల్లేరు ప్రాంతంలో చేపల వేట ప్రధాన వృత్తిగా వేలాది కుటుంబాలున్నాయి. 122 గ్రామాల్లో కొల్లేరు వాసులు నివసిస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ సరస్సులో నీటి కాలుష్యాన్ని తగ్గించడానికి గతంలో అనేక కమిటీలు ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనం చేకూరలేదు.

అనేక కమిటీలు.. సిఫార్సులు

కొల్లేరు పరిరక్షణకు అక్రమ చెరువుల కట్టడికి దాదాపుగా 4 దశాబ్దాల నుంచే కమిటీలు ఏర్పాటు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు, హైకోర్టు మొదలుకొని సుప్రీంకోర్టు వరకు అనేక న్యాయపోరాటాలు కొనసాగినా శాశ్వత పరిష్కారం నేటికీ దక్కలేదు. సరస్సును పరిరక్షిస్తూ స్థానికుల జీవనప్రమాణాలు పెంచి పూర్తి ఉపాధి అవకాశాలుండేలా చూడాలనేదే ఏళ్ళ నుంచి ఉన్న డిమాండ్. ఈ క్రమంలో 1983లో కేఎల్‌డీసీ సబ్ కమిటీ, 1987 శ్రీ రామకృష్ణయ్య కమిటీ, 1996లో శాసన సభ కమిటీ, 2006లో సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర సాధికారత కమిటీ, 2010లో అజీజ్ కమిటీ, 2015లో సుకుమార్ కమిటీ ఇలా అనేక కమిటీలు రకరకాల నివేదికలు సమర్పించాయి.



కేంద్ర సాధికారత కమిటీ సభ్యులకు వినతిపత్రం ఇస్తున్న కొల్లేరు గ్రామస్తులు

కీలకమైన సిఫార్సులు

- సముద్రానికి నీరు పోయే కీలక మార్గమైన ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగించి సామర్థ్యం పెంచాలి.
- బుడమేరు, తమ్మిలేరుపై వరద కట్టలు, జలాశయాల నిర్మాణం, చిన్న, పెద్ద కాలువలు మళ్లింపు జరగాలి.
- కొల్లేరు అవుట్‌ఫాల్ ఉన్న ఉప్పుటేరు వద్ద రెగ్యులేటరీ ఏర్పాటు చేయడంతో పాటు వెడల్పు, లోతును సరిచేయాలి.
- సరస్సు పరిరక్షణ కోసం సిల్ట్ తొలగించి 4వ కాంటూరులో వెదురు చెట్లు ఏర్పాట్లు చేయాలి. అక్రమ రొయ్యలు, చేపల చెరువులను నియంత్రించి సరస్సును పరిరక్షించడంతో పాటు నీటి కాలుష్యాన్ని తగ్గించాలి.
- రెగ్యులేటర్ నిర్మాణం తర్వాత చానలైజేషన్ పథకాన్ని తిరిగి ప్రారంభించి ప్రవాహ మార్గాల్లో అవసరమైన చోట్ల కాల్వ మళ్ళింపు జరగాలి.
- 7500 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదికి మళ్లించడానికి బుడమేరులో ఉన్న మళ్లింపు చానెల్‌ను సాధ్యమైనంత వరకు మెరుగుపరచాలి
- కొల్లేరు సరస్సు ప్రస్తుత స్థితిని అంచనా వేయడానికి క్షేత్ర, ఉపగ్రహ సర్వే నిర్వహించాలి, పాత రికార్డులు 1900 ఏడీ గెజిట్ ప్రకారం సర్వే చేయాలి. వాస్తవ కాంటూరు పరిధులను గుర్తించి సరస్సులో అక్రమ అనధికార చేపల, రొయ్యల చెరువులను ధ్వంసం చేయాలి.

కొల్లేరును 3వ కాంటూరుకు
కుదించాలి

కేంద్ర కమిటీకి సీపీఎం వినతి



కేంద్ర కమిటీకి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొల్లేరును 3వ కాంటూరుకు కుదించి, వారి ఉపాధిని కాపాడి, అక్కడి ప్రజలను ఆదుకోవాలని కొల్లేరులో మంగళవారం పర్యటించిన సీఈసీకి సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల హామీలు అమలు కాలేదని, కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాలలో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారన్నారు. 1975-76 సంవత్సరాలలో అప్పటి వెంగళరావు ప్రభుత్వం 146 సొసైటీలు ఏర్పాటు చేసి 7100 ఎకరాలలో చేపల చెరువులు తవ్వించారని అన్నారు. కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా వేలాది ఎకరాల్లో చేపల చెరువులను ధ్వంసం చేశారని, అయితే ఆ సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించాలని కోరారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ప్రస్తుత అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి, సుప్రీంకోర్టుకు నివేదించాలని కోరారు. కొల్లేరులో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, అటవీ అధికారుల వేధింపులు, అవినీతి అరికట్టాలని కోరారు. కమిటీని కలిసిన వారిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బీ బలరాం, జిల్లా కార్యదర్శి ఏ రవి తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికులకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలి



భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

భీమవరం: భీమవరం మున్సిపల్ కార్మికులందరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేయాలని, ఇంజినీరింగ్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ మున్సిపాలిటీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. తల్లికి వందనం పథకం పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు వర్తింప చేయకపోవడం దారుణమన్నారు. అరకొర జీతాలతో పని చేస్తున్న స్కీం కార్మికులందరిని తల్లికి వందనం పథకానికి దూరం చేశారని, 300 యూనిట్లు విద్యుత్ వినియోగం, రూ.20 వేల జీతం సాకుతో పథకాన్ని నిలుపుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆందోళన చేపడతారని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం మున్సిపల్ మేనేజర్‌కు అందచేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు నీలాపు రాజు, ఎస్‌కే నాగూర్, బంగారు వరలక్ష్మి, చిన్న పెద్దిరాజు, మామిడి శివ, పళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు సమస్యలను సుప్రీంకు నివేదిస్తాం

సీఈసీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్



సమావేశంలో మాట్లాడుతున్న సీఈసీ సభ్యులు చంద్రశేఖర్ గోయెల్

ఏలూరు(మెట్రో): కొల్లేరు ప్రాంత సమస్యలపై రెండు రోజులు అధ్యయనం అనంతరం నిర్దేశించిన కాలపరిమితిలోపు నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పిస్తామని సీఈసీ సభ్యుడు చంద్రశేఖర గోయల్ వెల్లడించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తరించిన కొల్లేరు సరస్సు ప్రాంత ప్రజల సమస్యలపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అధ్యయనం చేసేందుకు గోయల్ నేతృత్వంలో బృందం మంగళవారం జిల్లాకు చేరుకుంది. ఏలూరులో రాత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 1999లో కొల్లేరు పరిరక్షణ అంశం నోటిపై చేశారన్నారు. కొల్లేరు విషయంలో రీమార్కేషన్, సంబంధిత విషయాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, ఈ విషయం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లిందన్నారు. ఈ విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. ఇంకా పరిష్కారం కాని అంశాలు ఉన్నాయని గోయల్ చెప్పారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిన అంశాలపై నివేదిక ఇవ్వాలని తమ కమిటీని నియమించారని, ఆ దిశగా తొలిరోజు ఏలూరు జిల్లా పరిధిలోని కొల్లేరు గ్రామాల్లో పర్యటించామన్నారు. అక్కడ వాస్తవ పరిస్థితి, ప్రజలతో ముఖాముఖి, తమకు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పరిశీలించామని వివరించారు. తొలిరోజు పర్యటన తమ పరిశీలనలో ముందడుగు అన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కేంద్ర మంత్రితో భేటీ అయ్యామని చెప్పారు. బుధవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా అధికారులుతో మరో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ రెండు రోజుల పర్యటన అనంతరం గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో సుప్రీంకోర్టుకు సమర్పిస్తామని వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసి నివేదిక ఇచ్చేందుకు సుప్రీంకోర్టు తమకు 12 వారాల గడువు ఇచ్చిందని చెప్పారు. సమావేశంలో కమిటీ మెంబరు కార్యదర్శులు డా.జె.ఆర్.భట్, జి.భానుమతి, కమిటీ సభ్యులు సునీల్ లిమాయే, ప్రకాష్ చంద్రభట్‌లతో పాటు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ అజేయ్ కుమార్ నాయక్, మత్స్యశాఖ కమిషనరు రమాశంకర్ నాయక్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.పి.ఎస్.కిషోర్, తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఏలూరు చేరుకున్న కేంద్ర సాధికార కమిటీ సభ్యులకు కలెక్టర్ ఘనంగా స్వాగతం పలికారు.

గూడెంలో మద్యం పరవళ్లు

వాణిజ్య కేంద్రంగా పేరొందిన తాడేపల్లిగూడెం ఇప్పుడు లిక్కర్ సిండికేట్‌కు అడ్డాగా మారింది. అడ్డూ అదుపూ లేకుండా నిరంతరం మద్యం అమ్మకాలు సాగిపోతున్నాయి. దాబాల్లో సైతం లిక్కర్ సులువుగా దొరుకుతోంది. ఈ సిండికేట్‌ను నడిపించేది కూటమి నేతలే కావడంతో ఎక్సైజ్, పోలీస్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- తాడేపల్లిగూడెంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- బార్లను తలదన్నేలా షాపుల వద్ద సిట్టింగ్ ఏర్పాట్లు
- దాబాల్లోనూ మద్యం లభ్యం
- గత ఐదున్నర నెలల్లో 1,93,792 కేసుల లిక్కర్, 73,019 కేసుల బీర్లు విక్రయాలు



మద్యం కోసం తాడేపల్లిగూడెంలోని ఒక మద్యం దుకాణం వద్ద కిక్కిరిసిన మందుబాబులు

సాక్షి, భీమవరం: జిల్లాకు ముఖ్య వాణిజ్య కేంద్రమైన తాడేపల్లిగూడెం ఉల్లి, బెల్లం, మామిడి, పప్పుదినుసుల వ్యాపారానికి ప్రఖ్యాతి. చుట్టుపక్కల ప్రాంతాల వారితో పాటు ఇతర జిల్లాల నుంచి హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, వినియోగదారులు, సరుకుల రవాణ వాహనాలతో రోజూ పట్టణానికి భారీగా వచ్చి వెళ్తుంటారు. ఇంత ప్రాముఖ్యమున్న పట్టణంలో మద్యం పరవళ్లు తొక్కుతోంది. గత ప్రభుత్వంలో చాలా వరకు ఊరికి దూరంగా ఉన్న మద్యం షాపులను కూటమి ప్రభుత్వం తెచ్చిన ప్రైవేట్ మద్యం పాలసీతో సిండికేట్లు ఇప్పుడు పట్టణంలోని జనావాసాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లోకి తెచ్చేశాయి. ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా షాపుల వద్దనే కూర్చుని తాగేందుకు టేబుళ్లు, కుర్చీలతో సిట్టింగ్ ఏర్పాట్లు చేశారు. మందులోకి మంచింగ్, ఫాస్ట్‌ఫుడ్స్ అందిస్తున్నారు. ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే అమ్మకాలు చేయాల్సి ఉండగా వేళాపాలా లేకుండా ఇష్టానుసారంగా షాపులు నిర్వహిస్తున్నారు. నిర్ణీత సమయం దాటాక బాటిల్‌పై అధనంగా రూ. 10 నుంచి రూ. 20 వరకు పెంచి అమ్మకాలు చేస్తున్నట్టు మందుబాబులు చెబుతున్నారు.

తాడేపల్లిగూడెం సర్కిల్ పరిధిలోని తాడేపల్లిగూడెం అర్బన్, రూరల్, పెంటపాడు మండలాల్లో 38 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో పట్టణ పరిధిలో 12 షాపులు, నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. నియోజకవర్గంలోని ఒక్కో షాపు పరిధిలో రెండు నుంచి ఐదు వరకు బెల్టులు తెరిచి బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 వరకూ అదనంగా అమ్ముతున్నారు. కొందరు మొబైల్ బెల్టులు నిర్వహిస్తూ నేరుగా మందుబాబుల వద్దకే వెళ్లి మద్యం అందిస్తున్నారు. సిండికేట్ కనుసన్నల్లోనే వీటి నిర్వహణ జరుగుతోంది.

బెల్ట్ షాపులపై దాడులు నామమాత్రమే

తాడేపల్లిగూడెం సర్కిల్ పరిధిలో బెల్టు అమ్మకాలుపై ఇప్పటి వరకు 85 కేసులు నమోదుచేసిన ఎక్సైజ్ పోలీసులు 85 మందిని అరెస్టు చేసి వారి నుంచి 160 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయినా ఎక్కడా తగ్గకుండా బెల్టుల నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలు తుంగలోకి తొక్కడంతో నియోజకవర్గంలో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ప్రైవేట్ షాపులు ప్రారంభించిన గత ఏడాది అక్టోబరు 16 నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి సర్కిల్ పరిధిలో 1,93,792 కేసుల లిక్కర్, 73,019 కేసుల బీర్లు విక్రయాలు జరగగా వీటిలో అధిక శాతం తాడేపల్లిగూడెంలోనే జరిగినట్టు సమాచారం. గత మూడు నెలల్లో ఈ అమ్మకాలు మరింత పెరిగాయి. గత ప్రభుత్వ మద్యం దుకాణాలతో పోలిస్తే లిక్కర్ సేల్స్ భారీగా పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

సరసమైన ధరలకే

సరసమైన ధరలకే మద్యం దొరుకుతుందంటూ కొన్ని దుకాణాల వద్ద గతంలో బోర్డులు సైతం వెలిశాయి. ఇటీవల వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఈ బోర్డులు, విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలు గురించి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శలు చేయడంతో సంబంధిత అధికారులు ఆగమేఘాలపై షాపుల వద్ద బోర్డులను తొలగించారు.

గతంలో నిబంధనలు అమలు

వైఎస్సార్‌సీపీ హయాంలో నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు సాగేవి. బెల్టుషాపులు అరికట్టడంతో పాటు నిర్ణీత వేళల్లో మాత్రమే అమ్మకాలు చేసేవారు. షాపుల వద్ద కొనుగోలు చేసి తీసుకువెళ్లిపోవడమే తప్ప తాగేందుకు వీలు లేకుండా చేశారు. షాపుల నిర్వహణ ప్రభుత్వ అధీనంలో ఉండటంతో మద్యం ఆదాయం పూర్తిగా ప్రభుత్వ ఖజానాకు చేరేది. కాగా కూటమి ప్రభుత్వం మద్యాన్ని మరలా ప్రైవేట్ పరం చేయడంతో సిండికేట్లు ఇష్టారాజ్యంగా మారింది.



తాడేపల్లిగూడెంలోని ఒక మద్యం దుకాణం వద్ద సిట్టింగ్ ఏర్పాట్లు

దాబాల్లో విచ్చలవిడిగా మద్యం

పట్టణంలో పది వరకు దాబాలు ఉండగా పలుచోట్ల ఫుడ్‌తో పాటు మద్యం కూడా అందిస్తున్నారు. ఎమ్మార్పీ ధరపై క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ. 30, బీర్లకు రూ. 40 వరకు పెంచి సరఫరా చేస్తున్నారు. బార్లను తలపించేలా మందుబాబుల కోసం రాత్రి వేళల్లో ఆరుబయట మంచాలు ఏర్పాటుచేసి మరీ దాబాలను నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. పట్టణ శివార్లు, హైవేకు సమీప దాబాల్లో ఈ తరహా అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి..

క్లుప్తంగా

ఇండియన్ స్విమ్మింగ్ టీం విజయం దేశానికే గర్వకారణం

దెందులూరు: భారత స్విమ్ టీం సాధించిన అద్భుత విజయం దేశానికే గర్వకారణమని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించకపోయినా ఇంగ్లీష్ ఛానల్ నుంచి ఫ్రెంచ్ కోస్ట్ ఇంగ్లాండ్ వరకు 59 కిలోమీటర్లు స్విమ్మింగ్ చేసి టీం విజయం సాధించడం భరత జాతికి గర్వకారణమన్నారు. ఇండియన్ స్విమ్మింగ్ టీం లీడర్ ఏలూరుకు చెందిన బలగ గణేష్ నాయకత్వంలో విజయం సాధించడం వ్యక్తిగతంగానూ, ఏలూరు జిల్లా వాసిగా తనకు ఎనలేని సంతోషాన్నిచ్చిందన్నారు. టీం సభ్యులు అమన్ మానవ్ దీపక్ రెస్పీర్ ముదుగప్పలను అబ్బయ్య చౌదరి అభినందించారు.

మోటారు సైకిళ్ల చోరీపై కేసు నమోదు

భీమవరం: మోటార్‌సైకిళ్ల చోరీపై భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మే 25వ తేదీన నెఫ్రాంకాలనీకి చెందిన షేక్ బాబ్జి తన ఇంటివద్ద మోటార్‌సైకిల్ పార్క్ చేశాడు. కాసేపటి తరువాత మోటార్‌సైకిల్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. అలాగే టిడ్కో ఇళ్లు వద్ద ఈనెల 10వ తేదీన తన మోటార్‌సైకిల్ చోరీకి గురైందని కె నూకరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడికి చెందిన బాలిక(17) అదృశ్యంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాలిక హైదరాబాదులో ఇంటర్మీడియెట్ చదువుతోంది. వారం రోజుల కిందట సెలవులకు గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి బాలిక వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామంలోని బంధువుకు సోమవారం ఉదయం భోజనం తీసుకువెళ్లి తరువాత తిరిగి రాలేదు. వెంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

21న ఏలూరులో జాబ్‌మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వీ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ సంస్థలైన అపోలో ఫార్మసీ, బజాజ్ కాపిటల్, ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియా సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. ముందుగా తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు బీఐటీ.ఎల్‌వై/ఎన్‌సీఎస్-ఈఎల్‌యూఆర్‌యూ-డబ్ల్యూజీ వాట్సాప్ గ్రూప్‌లో చేరవచ్చని లేదా డీఈ.ఈఎల్‌యూఆర్‌యూఎట్ ద రేట్ ఆఫ్ జీమెయిల్.కామ్‌కు మెయిల్ చేయవచ్చన్నారు. ఇతర సమాచారం కోసం 88868 82032 నంబరును సంప్రదించవచ్చన్నారు.

నేడు ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రానికి మంత్రి రాక

ఏలూరు (మెట్రో): రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పెదవేగి ఆయిల్‌పామ్ పరిశోధనా కేంద్రాన్ని సందర్శిస్తారు. ఉదయం 10.45 గంటలకు చేరుకుని పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయిల్‌పామ్ ఉత్పాదకులతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 1.15 గంటలకు పెదవేగి నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హైదరాబాదుకు వెళతారు.

కొందరికే తల్లికి వందనం

- నిబంధనల పేరుతో చాలామందికి ఎగనామం
- మండలానికి వెయ్యి మందికి పైగా కోత
- కరెంట్ బిల్లులను సాకుగా చూపి అర్హులకూ మొండిచేయి
- మాట తప్పిన చంద్రబాబుపై మండిపడుతున్న జనం

నరసాపురం రూరల్: కూటమి సర్కార్ అట్టహాసంగా అమలు చేసిన ‘తల్లికి వందనం’ నిరుపేద తల్లులకు అందకుండా పోయింది. పథకం అమలుకు సవాలక్ష నిబంధనలు విధించిన కూటమి సర్కార్ అంతిమంగా అర్హులకు మొండి చేయి చూపింది. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అందరికీ ఏటా రూ.15 వేల చొప్పున క్రమం తప్పకుండా ఇస్తామని ఎన్నిక వేళ హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచాక రూ.13 వేలే అంటూ మాటమార్చారు. అది కూడా అందరికీ ఇవ్వకుండా మోసం చేశారు. దీంతో చంద్రబాబు మాటలు నమ్మి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్న నిరుపేద కుటుంబాల వారు శాపనార్థాలు పెడుతున్నారు.

నిబంధనలతో కొర్రీలు

తల్లికి వందనం కింద ఎంత మంది విద్యార్థులుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న చంద్రబాబు.. పథకం అమల్లోకి వచ్చేసరికి సవాలక్ష నిబంధనలు విధించారు. యూడైస్ ప్రకారం జాబితాలు సేకరించామని చెబుతున్నప్పటికీ చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు ప్రభుత్వం సేకరించిన గణాంకాలకు తేడా ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి సర్కార్ (2024–25 విద్యా సంవత్సరం)లో తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తం ఎగవేసి ఈ సంవత్సరం ఇస్తామన్న మొత్తంలో కూడా భారీగా కోతలు విధించి అర్హత ఉన్నప్పటికీ చాలా మందికి ‘తల్లికి వందనం’ ఆర్థిక సాయం మొత్తం ఖాతాల్లో జమ కాలేదు. దీంతో లబ్ధిదారులు సచివాలయాలు, బ్యాంకులు, కరెంటు ఆఫీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం డబ్బు జమకానట్లు తెలియడంతో చాలామంది ఉసూరు మంటూ వెనుదిరిగి వెళుతున్నారు. నరసాపురం మండలం, పట్టణంలలో ఎక్కువ మందికి విద్యుత్ వినియోగం ఎక్కువ అనే కారణంతో పథకం సొమ్ములు జమకాలేదని తెలియడంతో నరసాపురం పట్టణంలోని విద్యుత్‌సబ్ స్టేషన్ వద్ద గత రెండు రోజులుగా పథకం లబ్ధిదారులు క్యూకడుతున్నారు.

జగన్ హయాంలో విప్లవాత్మక మార్పులు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్యార్థుల భవితకు బాటలు వేశారు. అమ్మ ఒడి పథకాన్ని ప్రారంభించి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. అంతేకాకుండా ‘నాడు– నేడు’ పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. విదేశీ విద్యా దీవెన, గోరుముద్ద తదితర పథకాలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన విషయాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నారు.



నరసాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పడిగాపులు పడుతున్న తల్లిదండ్రులు



తల్లికి వందనం ఇప్పించాలని వేములదీవి వెస్ట్ సచివాలయంలో వేడుకుంటున్న తల్లులు

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పడిగాపులు

యలమంచిలి: అధిక విద్యుత్ వినియోగం సాకుతో ప్రభుత్వం చాలామందికి ‘తల్లికి వందనం’ సొమ్ములు జమ చేయలేదు. దీంతో తల్లులు లబోదిబోమంటున్నారు. సోమవారం లబ్ధిదారులంతా సచివాలయానికి వెళ్లి అడిగితే రూ.300 యూనిట్లు లోపే విద్యుత్ వినియోగం ఉంటే కరెంట్ ఆఫీస్ నుంచి సర్టిఫికెట్ తెచ్చుకుంటే గ్రీవెన్స్‌లో పెడతామని చెప్పారు. దీంతో మండల వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు మంగళవారం ఉదయం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పడిగాపులు పడ్డారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ప్రతి ఒక్కరీ విద్యుత్ బిల్లు, సెల్, ఆధార్ నెంబర్లతో ఆన్‌లైన్‌లో తనిఖీ చేసి అంత వాడకం లేని వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. అయితే ఒక్కసారిగా వందల సంఖ్యలో లబ్ధిదారులు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తరలిరావడంతో బిల్లులు తనిఖీ చేయడానికి సిబ్బంది నానాయాతన పడుతున్నారు.



యలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మహిళల పడిగాపులు

కనెక్షనే లేదు.. బిల్లు ఎక్కువ వచ్చిందంటా



రెండవ తరగతి చదువుతున్న మా పాపకు ‘తల్లికి వందనం’ డబ్బులు వేయలేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని చెబుతున్నారు. ఆక్వా పట్టుబడులకు రోజువారీ కూలీ పనులకు వెళ్లే మేము ఇటీవలే ఇంటి నిర్మాణం చేపట్టాం. ఇంకా కరెంటు కనెక్షన్ కూడా ఇవ్వలేదు.

– సంగాని కనకదుర్గ, బియ్యపుతిప్ప

నేనుండేది అద్దె ఇంట్లో.. నాకు 8 మీటర్లా?



ఈ ప్రభుత్వం మాలాంటి పేదలకు అన్యాయం చేయడం దుర్మార్గం. అద్దె ఇంటిలో ఉంటున్న నాకు 8 విద్యుత్ కనెక్షన్లు చూపిస్తున్నాయని చెబుతున్నారు. తల్లికి వందనం ఇవ్వకుండా కుంటి సాకులు చూపడం అన్యాయం. సమస్య పరిష్కారం కోసం నరసాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాను.

– ఇందుకూరి సోమేశ్వరరావు. నరసాపురం

కరెంట్ బిల్లు రూ.వంద లోపే



ఎన్నికల ముందు పిల్లలందరికీ తల్లికి వందనం వేస్తామన్నారు. మొదటి ఏడాది ఎలాగూ వేయలేదు. నాకు పాప, బాబు ఉంటే ఇప్పుడూ ఒక్కరికీ కూడా వేయలేదు. మాకు కరెంటు బిల్లు వంద రూపాయల లోపే వస్తుంది. అయినా 300 యూనిట్లకంటే ఎక్కువ వినియోగిస్తున్నారనే సాకుతో పథకాన్ని నిలిపివేశారు.

– మత్తి జాన్‌శామ్యూల్, నరసాపురం, క్రిస్టియన్‌పేట

ఒక్కరికీ ఇవ్వలేదు



నాకు రెండవ తరగతి చదివే మనుమడు, మూడవ తరగతి చదివే మునుమరాలు ఉన్నారు. ఒక్కరికీ తల్లికి వందనం డబ్బులు వేయలేదు. మాకు కరెంటు బిల్లు రూ.150 మాత్రమే వస్తుంటే.. కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందంటున్నారు. మాలాంటి వాళ్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

– పిల్లి సుగుణమ్మ, మల్లవరం

తాడేపల్లిగూడేనికి ఎయిర్‌పోర్టు

భూసేకరణకు రూ.1570.64 కోట్లు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించే దిశగా కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి జిల్లా ఉన్నతాధికారులకు భూసేకరణ ప్రక్రియ చేపట్టాల్సిందిగా ఉత్తర్వులు అందాయి. రాష్ట్రంలో నూతనంగా ఎయిర్‌పోర్టుల నిర్మాణం చేపట్టే విషయంలో గూడెంలో కూడా ఒక ఎయిర్‌పోర్టు నిర్మించనున్నట్టు కేంద్ర విమానయానశాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. గూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గాను తాడేపల్లిగూడెం, జగ్గన్నపేట గ్రామంలో భూసేకరణ చేయాల్సిందిగా, దీని కోసం రూ.1570.64 కోట్లను మంజూరు చేస్తున్నట్టు వచ్చిన ఉత్తర్వుల కాపీ జిల్లా కలెక్టర్‌కు అందింది. ఈ మేరకు భూసేకరణ విషయంపై రెండు గ్రామాల్లో వివరాలు సేకరించి రెండు వారాలలోగా తమకు నివేదిక అందించాల్సిందిగా గూడెం ఆర్డీఓ, తహసీల్దార్‌కు ఉత్వర్వులు ఇచ్చారు. కేంద్ర విమానయాన శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఎయిర్‌పోర్టు విషయంపై సంప్రదింపులు జరిగిన నేపథ్యంలో భూసేకరణ విషయమై సెక్రటరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎయిర్‌పోర్టు)లకు వచ్చిన వినతి మేరకు ఉత్వర్వులు వచ్చాయి. పూర్తిగా గూడెం నియోజకవర్గ పరిధిలో వెంకట్రామన్నగూడెం, జగ్గన్నపేట గ్రామాల పరిధిలో ఈ భూసేకరణ జరగాల్సి ఉంది. ప్రభుత్వ భూమి అందుబాటులో లేనందున ప్రైవేటు వ్యక్తుల నుంచి స్థల సేకరణ చేస్తారు. కేంద్ర భూసేకరణ చట్టాన్ని అనుసరించి 1:2 నిష్పత్తిలో పరిహారం ఇస్తారా, ఎలా ఇస్తారనేది వేచి చూడాల్సి ఉంది.

ఇంటింటి కేన్సర్ స్క్రీనింగ్ సర్వే

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటి కేన్సర్ స్క్రీనింగ్ సర్వే నిర్వహిస్తున్నామని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కేన్సర్ స్క్రీనింగ్ సర్వేను ఆయన పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ప్రతి రోజూ జరిగే ఈ సర్వేలో వైద్య సిబ్బందికి గృహ యజమానులు సహకరించి వివరాలు తెలియజేయాలని కోరారు. కేన్సర్ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్‌ఎం సుభాసినీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతులు.. వేడుకోళ్లు..





పెద ఎడ్లగాడి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఈసీ సభ్యుడు డాక్టర్ జైవర్ధన్ రమన్‌లాల్ భట్, మణుగునూరులంక వద్ద కొల్లేరు ప్రజల ఎదురుచూపులు

- ఆశల పల్లకీలో కొల్లేరు ప్రజలు
- సీఈసీ కమిటీకి అర్జీలు
- జనసంద్రమైన పందిరపల్లిగూడెం

కై కలూరు: అయ్యా.. మా జీవనోపాధికి గండికొట్టారు. నష్టపరిహారం చెల్లించకుండా కొల్లేరు ఆపరేషన్‌లో జిరాయితీ, డీఫాం భూములలో చెరువులను ధ్వంసం చేశారు. కొల్లేరు గ్రామాల్లో చచ్చిన శవాలను పూడ్చాలన్నా.. అటవీశాఖ నిబంధనలు అడ్డువస్తున్నాయి. మా భూములు తిరిగి ఇచ్చేయండి అంటూ కొల్లేరు ప్రజలు సుప్రీంకోర్టు పంపించిన కేంద్ర సాధికార కమిటీ(సీఈసీ) ముందు గోడు వెళ్లబోసుకున్నారు. సాధికారిత కమిటీ ఏలూరు నుంచి మధ్యాహ్నం 3 గంటలకు కైకలూరు నియోజకవర్గం మణుగునూరులంక వద్దకు వచ్చారు. సమీప కొల్లేరు గ్రామాల ప్రజలు రోడ్లుపై నిలుచున్నారు. ముందుగా పెదఎడ్లగాడి నుంచి కొల్లేరు నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలందరూ అక్కడికి వచ్చి సీఈసీ కమిటీనికి వినతిపత్రాలు అందించారు. అక్కడ నుంచి మార్గమధ్యలో కొల్లేరు ప్రాంతాలను చూస్తూ సీఈసీ కమిటీ ముందుగా సాగింది. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు కామినేని, ధర్మరాజులతో కలసి వచ్చిన సీఈసీ వాహనాలు వీరికి తెలియకుండా కలకర్రులో కొల్లేరును పరిశీలించారు. పెద ఎడ్లగాడి వద్ద దాదాపు 30 నిమషాలు కలెక్టర్, ఎస్పీ సీఈసీ కోసం వేచి ఉన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులకు సంబంధించి 40 కార్లు ఉండటంతో ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగింది.

ఆటపాక పక్షుల కేంద్రంలో సమావేశం

ఆటపాక పక్షుల కేంద్రం పక్షి నమూనా మ్యూజియాన్ని సీఈసీ బృందం పరిశీలించింది. అక్కడ కొంత సమయం అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. పక్షుల కేంద్రంలో నీరు లేకపోవడం, వివిధ రకాల పక్షుల గురించి అటవీశాఖ అధికారులు వివరించారు. పక్షుల కేంద్రం సమీపంలోని దెందులూరు నియోజకవర్గం కోమటిలంక ప్రజలు ఎమ్మెల్యే చింతమనేనితో కలసి సీఈసీ సభ్యులకు వినతపత్రం అందించారు. గ్రామానికి అవసరమైన రహదారిని నిర్మించాలని కోరారు. వంతెన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

వేలాదిగా ప్రజలు

కేంద్ర సాధికారిత కమిటీకి అర్థమయ్యే విధంగా ఇంగ్లీషులో ప్లకార్డులను కొల్లేరు ప్రజలు ప్రదర్శించారు. సీఈసీ రాక నేపథ్యంలో కై కలూరు, ఉండి నియోజకవర్గాల పరధిలోని కొల్లేరు గ్రామాల్లో పెద్దలు, మహిళలు, పిల్లలు వేలాదిగా తరలివచ్చారు. సేవ్ పూర్ పీపుల్ ఎడ్యుకేషన్, ప్లీజ్ సేవ్ అజ్, వుయ్ సేవ్ బర్డ్స్.. యూ సేవ్ ఫిషర్‌మెన్స్ వంటి నినాదాల కార్డులను ప్రదర్శించారు. ఎమ్మెల్యే కామినేని తెలుగును ఇంగ్లీషులో అనువదించి సీఈసీకి వివరించారు. సీఈసీ నుంచి వచ్చిన నలుగురు సభ్యుల్లో జి.భానుమతికి తెలుగు భాష వచ్చినప్పటికీ ఆమె ప్రసంగించలేదు. ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర చేపల రైతు సంఘు అధ్యక్షుడు తాడినాడ బాబు, కొల్లేరు కమిటీ సభ్యుడు నంబూరి శివాజీరాజు, కొల్లి బాబీ, పూల రాజీ, బీకేఎం .నానీ త్రినాథరాజు, సీపీఎం నాయకులు బలరాం, రవి తదితరులు పాల్గొన్నారు.



వదలిలో దమ్ము చేస్తున్న రైతన్న



చిన్నంవారిపాలెంలో నారుమడికి అలుకుతున్న దృశ్యం

● ఆశల సాగు

తొలకరి చినుకులు ప్రారంభం కావడంతో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు ఉత్సాహంగా సన్నద్ధం అవుతున్నారు. మృగశిర కార్తె తొలి రోజు నుంచి రైతులు సార్వా సాగుకు అనువైన వరి వంగడాలను సిద్ధం చేసుకున్నారు. పెనుగొండ, వెంకట్రామపురం, వదలి, సిద్ధాంతం గ్రామాల్లో సాగు పనులు జోరుగా ప్రారంభమయ్యాయి. పొలాల్లో దమ్ము చేస్తూ, విత్తనాలు చల్లుతూ సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఎటువంటి ఆటంకం లేకుండా సాగు పనులు ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నారు – పెనుగొండ



సార్వా సాగు నారుమడికి విత్తనాలు జల్లుతున్న రైతన్న

చోరీ కేసుల్లో నలుగురు నిందితుల అరెస్టు

గన్నవరం: వేర్వేరు చోరీ కేసుల్లో నలుగురు నిందితులను ఆత్కూరు పోలీసులు మంగళవారం చాకచక్యంగా పట్టుకుని ఐదు బైక్‌లు, విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుల వివరాలను డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఉంగుటూరు మండలం పొట్టిపాడులో మే 3వ తేదీ తెల్లవారుజామున ఇంటిలో నిద్రిస్తున్న బాణాల సుభాషిణి మెడలోని ఐదు కాసుల బంగారు గొలుసును దొంగలు అపహరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సీఐ కేవీఎస్‌ఎన్ సత్యనారాయణ నేతృత్వంలో ప్రత్యేక టీమ్ దర్యాప్తు చేపట్టింది. జంగారెడ్డిగూడెం శివారు వేగవరం గ్రామానికి చెందిన పారేపల్లి శేషు, పోలవరపు నాగదుర్గాప్రసాద్, దుగ్గిరాల శివరామకృష్ణ ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు శేషును మంగళవారం అరెస్టుచేసి, అతని వద్ద బంగారు గొలుసు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు నిందితులు కొవ్వూరులో జరిగిన ఓ చోరీ కేసులో పట్టుబడి జైలులో రిమాండ్‌లో ఉన్నారు.

మరో ముగ్గురి అరెస్టు

ఇటీవల ఆత్కూరు, వీరవల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా జరుగుతున్న బైక్ చోరీలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. దొంగల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టిన ఆత్కూరు పోలీసులు పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద బైక్‌పై వెళ్తున్న ఏలూరుకు చెందిన దత్తి నవీన్, భీమవరానికి చెందిన గుత్తుల రవికుమార్, సాయిశ్రీరామ్‌ను అనుమానితులుగా గుర్తించి అదుపులో తీసుకున్నారు. పోలీసుల విచారణలో వారు బైక్ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. పెదపాడు, కై కలూరు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో చొరబడి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించినట్లుగా ఒప్పుకున్నారు. పోలీసులు వారి వద్ద నాలుగు బైక్‌లు, బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు ఇప్పటికే పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చారు. ఈ కేసులను ఛేదించిన సీఐ సత్యనారాయణ, ఎస్సై సురేస్ చావా, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి డి.భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్న 15 నుంచి 30 సంవత్సరాల్లోపు వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం అర్హులకు ప్రైవేట్ సంస్థల్లో అవకాశాలు కల్పిస్తామని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 8978524022 సంప్రదించవచ్చని తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దిరుసుమర్రులో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై ఎస్సైలు పి.ఉమా మహేశ్వరరావు, పి.సునీల్‌కుమార్ తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడు జి బాబులును అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



నిందితుడు, మద్యం సీసాలతో ఎస్సైలు

అంజన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఆలయానికి రూ.2,15,593 ఆదాయం సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

తల్లికి వందనం కోతలే!

- అర్హులకు అన్యాయం...!
- నిబంధనలతో పథకానికి తూట్లు
- అయోమయంలో తల్లిదండ్రులు
- వేర్వేరు కారణాలతో నిలిచిన సొమ్ములు
- సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తానంటూ గత ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. తీరా గద్దె నెక్కిన తర్వాత తొలి ఏడాది విజయవంతంగా ఎగొట్టేశారు. పాలనకు రెండో ఏడాది ప్రారంభమయ్యాక తొలిసారి అమల్లోకి తెచ్చిన తల్లికి వందనాన్ని నిబంధనల చట్రంలో ఇరికించారు. ఆచరణకొచ్చేసరికి కొర్రీలతో కోతలు పెట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి సర్కార్ తీరుపై ఆగ్రహిస్తున్నారు. ఎన్నికలప్పుడు ఒకలా...అధికారంలోకి వచ్చాక మరోలా మాట్లాడటం చంద్రబాబుకు కొత్తేమి కాదని విమర్శిస్తున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తల్లికి వందనం పథకం అమలు కర్ణుడి చావుకు సవా లక్షా కారణాలు అన్న చందంగా మారింది. ఈ నెల 12వ తేదిన ఈ పథకానికి సంబంధించి సీఎం చంద్రబాబు నిధులు విడుదల చేశారు. అయితే, 13వ తేది నుంచి తల్లుల ఖాతాలకు సొమ్ములు కావడం ప్రారంభించింది. కొంతమంది తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ కాగా, మరికొందరి తల్లుల ఖాతాలకు వేర్వేరు కారణాలతో సొమ్ములు నిలిచిపోయాయి. నిబంధనలకు మించి విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి కరెంటు బిల్లు రావడం, కుటుంబంలో రూ.12వేలకు మించి జీతం తీసుకుంటున్న వారు ఉండటం, సరైన ఆదాయ ధృవీకరణ లేకపోవడం, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉండటం వంటి కారణాలతో తల్లికి వందనం సొమ్ములు జమ కాలేదని తెలుస్తోంది. అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి సైతం సొమ్ములు పడలేదని సమాచారం. గతంలో అద్దె ఇళ్లల్లో ఉన్న సమయంలో ఇంటి యజమాని విద్యుత్ సర్వీస్‌కు అద్దె ఇంటిదారుల మొబైల్ నెంబరు లింకు కావడం, ప్రస్తుతం ఆ బిల్లు ఎక్కువగా రావడం వంటి కారణాలు తల్లికి వందనం సొమ్ములు జమ కాకపోవడానికి కారణాలుగా తెలుస్తున్నాయి. ఏడాది కాలానికి విద్యుత్ వినియోగం చూడవలసి ఉండగా, ఆరు నెలలకు మాత్రమే చూశారని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. నిబంధనలకు మించి విద్యుత్ వినియోగం ఉండటమే కారణంగా తల్లికి వందనం ఆగినట్లుగా



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి సచివాలయం-1

తెలుస్తోంది. పలువురికి విద్యుత్ బిల్లు నిబంధనల మేరకు ఉన్నా వేర్వేరు కారణాలతో ఆగినట్లుగా సమాచారం. పదవ తరగతి పూర్తయిన పలువురు విద్యార్థులకు సొమ్ములు జమ కాలేదని తెలిసింది.

'గూడెం'లో 27,667మంది విద్యార్థులు

తాడేపల్లిగూడెం టౌన్, రూరల్‌లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 27,667మంది విద్యార్థులు ఉన్నారని అధికారులు చెబుతున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే వారు 9345 కాగా, ప్రైవేట్ పాఠశాలల్లో 18,322 మంది వెరసి 27,667మంది ఉన్నారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఒక్క పెదతాడేపల్లి-1 సచివాలయం పరిధిలో 268మంది అర్హులు కాగా, అర్హత కలిగి జమ కాని వారు 69మంది ఉన్నారు. అలాగే, పెతాడేపల్లి-2 పరిధిలో 259మంది అర్హులు కాగా, అర్హత ఉండి వేర్వేరు కారణాలతో జమ కాని వారు 47మంది ఉన్నారు. అయితే, మండలం మొత్తం మీద ఎంత మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ అయ్యాయి ? ఎంత మందికి సొమ్ములు జమ కాలేదు వంటి వివరాలు కనీసం అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. కేవలం సచివాలయాలకే ఈ సమాచారం పరిమితమైనట్లుగా అధికారులు చెబుతున్నారు. వీటన్నింటినీ చూస్తే ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురి చేసే విధంగా తల్లికి వందనం అమలు తీరు ఉందని పలువురు పేర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అమ్మ ఒడి పథకాన్ని అమలు చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏదో రకంగా తల్లికి వందనం అర్హులను తగ్గించాలనే ఆలోచనలో ఉన్నట్లు పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడు సర్వీసులు ఉన్నట్లు చూపించారు



తనకు సొంత ఇల్లు లేదు. అన్నయ్య ఇంటిలో నివాసం ఉంటున్నాను. అయితే, తన పేరున ఏడు విద్యుత్ సర్వీసులు ఉన్నట్లుగా చూపించారు. దీంతో తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం సొమ్ములు జమ కాలేదు. గత ప్రభుత్వంలో తన కుమార్తెకు అమ్మ ఒడి కింద సొమ్ములు జమ అయ్యాయి. ప్రస్తుతం ఒక్కరికి కూడా సొమ్ములు రాలేదు. ప్రభుత్వం తప్పులను సరి చేసి నిజమైన లబ్ధిదారులకు సొమ్ములు జమ అయ్యేలా చూడాలి.

– గన్నమని మురళీకృష్ణ, పెదతాడేపల్లి, తాడేపల్లిగూడెం మండలం



సచివాలయంలో విద్యార్థి తండ్రి

దమ్ములోనే కాంప్లెక్స్ ఎరువులు వాడాలి



పొలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: రైతులు దమ్ములోనే కాంప్లెక్స్ ఎరువులు వాడాలని అత్తిలి మండల వ్యవసాయాధికారి టికే రాజేష్ అన్నారు. అత్తిలి మండలం పొలి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రైతులు బిల్ లేకుండా విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. వరిమోళ్లను తగలబెట్టవద్దని కోరారు. కార్యక్రమంలో మండలపరిషత్ అధ్యక్షుడు మక్కా సూర్యారావు, మండల టీడీపీ అధ్యక్షుడు పోలిశెట్టి చందు, కార్యదర్శి అల్లి అజయ్ కుమార్, నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలి

యలమంచిలి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్ కోరారు. యలమంచిలిలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలసి జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం పుస్తకం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు, మోసపు వాగ్దానాలకు పేటెంట్ హక్కు పొందిన రాజకీయ నాయకుడు చంద్రబాబు అన్నారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్‌లో సగం వాగ్దానాలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఏడాది కాలంలో ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహన దారుల లైసెన్సులను పరిశీలిస్తున్న ఎంవీఐ నాయక్

తాడేపల్లిగూడెం: ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై ఎనిమిది కేసులు నమోదు చేసినట్టు తాడేపల్లిగూడెం పట్టణ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ డి.సురేందర్‌సింగ్ నాయక్ మంగళవారం తెలిపారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడుపుతున్నందుకు ముగ్గురిపై , హెల్మెట్ లేకుండా, త్రిబుల్ రైడింగ్‌లకు సంబంధించి ఐదు కేసులు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి అపరాధరుసుం కింద 19 వేల రూపాయలు వసూలు చేసినట్టు ఆయన తెలియజేశారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేకుండా, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, సిగ్నల్స్‌కు విరుద్ధంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



అత్తిలి మండలం మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్

అత్తిలి: మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం అతిసారవ్యాధి నివారణపై వైద్యాధికారి డాక్టర్ పి కిరణ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్‌ద్రావణం, జింక్ టాబ్లెట్లు అందజేయాలని కోరారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేయవచ్చునో ఆరోగ్య విస్తరణాధికారి కడలి శాంతమూర్తి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ టీవీవీ ప్రసాద్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ కీర్తి పురస్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉద్యాన వర్సిటీ ఆఫీసర్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.బి.నాగేశ్వరరావుకు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ కీర్తి పురస్కారం లభించింది. వివిధ రంగాలలో చేసిన విశేష ప్రతిభకు గుర్తింపుగా నాగేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. రాజమండ్రిలో ఫిలాత్రోఫిక్ సొసైటీ, పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెడ్డి కమ్యూనిటీ సొసైటీ ఉపాధ్యక్షుడిగా విజయానందరెడ్డి



రెడ్డి సంఘ ఉపాధ్యక్షుడిగా నల్లమిల్లి విజయానందరెడ్డి



జిల్లా అధ్యక్షుడిగా కర్రి శ్రీనివాసరెడ్డి

పెంటపాడు: రెడ్డి కమ్యూనిటీ సొసైటీ డవలప్‌మెంట్ ఉపాధ్యక్షుడిగా పెంటపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి ఎన్నికయ్యారు. ఆ వివరాలను మంగళవారం వెల్లడించారు. ఇటీవల విశాఖపట్నంలో ఆ సంఘ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగిందన్నారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రపురెడ్డి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పలు జిల్లాల రెడ్డి కులస్తుల సమావేశం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా కర్రి శ్రీనివాసరెడ్డిని ఎన్నుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి పవన్‌కుమార్‌రెడ్డి, మహిళా నాయకురాలు పోతంశెట్టి లక్ష్మి, కర్రి సురేష్ రెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: జూలై 5న నరసాపురం కోర్టు సముదాయంలో జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం పదో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి, భీమవరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజీ చేసుకోదగిన అన్ని కేసులను ఈ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. అవగాహన కల్పించి కేసులు రాజీ అయ్యేలా పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని తెలిపారు.

ఉత్సాహంగా 'అంగన్‌వాడీ పిలుస్తోంది'

పాలకోడేరు: ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని విస్సాకోడేరు గ్రామంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పనిసరిగా తమ సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని తద్వారా చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యను నేర్పిస్తారన్నారు.

మలేరియాపై కలిసి పోరాటం చేద్దాం



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): మలేరియా వ్యాధిపై కలిసి కట్టుగా పోరాటం చేద్దామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్‌కాలనీ పరిధిలో 1, 2 వార్డులలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు మంగళవారం డాక్టర్ శ్రావ్య అధ్యక్షతన జరిగాయి. ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఆరోగ్య అవగాహన సదస్సులు జరిగాయి. మలేరియా వ్యాధిని నివారించాలంటే సమష్టి కృషి ఎంతో అవసరమని తెలిపారు. ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నీటి డ్రమ్ములను శుభ్రం చేయాలని, నీటి డ్రమ్ములపై మూతలు పెట్టాలన్నారు. దోమ లార్వాలను అంతం చేయాలని పలు సూచనలు చేశారు. మలేరియా అంతం మనతోనే సాధ్యమని అంటూ నినాదాలు చేశారు. గృహాలు వద్ద, కార్యాలయాలలోను విధిగా ఫ్రై డే, డ్రై డే పాటించాలని, ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు జ్యోతి, మల్లిక, ఆశాలు దుర్గ, భవాని, అంగన్‌వాడీ సిబ్బంది, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



దువ్వలో దివ్యాంగురాలు దుర్గాభవానికి కంప్యూటర్ బహుకరించిన మానవత సభ్యులు

తణుకు అర్బన్: మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియడారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ తణుకు శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కామ్‌వాల్ట్ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ సంస్థ సౌజన్యంతో రూ.70వేలు విలువైన కంప్యూటర్ సిస్టంను తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన రాయి దుర్గాభవానికి జీవనోపాధి నిమిత్తం అందజేసినట్లు విస్తరణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి పుష్పావతి తెలిపారు. జ్ఞానవేద కంప్యూటర్ సర్వీసెస్ నూతన ప్రారంభోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లోని అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇండియ లిమిటెడ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా సేవలందిస్తున్న కోడూరి శ్రీనివాస్, పిసిని సత్య కృషితో ఈ కంప్యూటర్ సిస్టంను అందజేసినట్లు వివరించారు. తణుకు మండలం అధ్యక్షురాలు కటారి శారదా దేవి, జిల్లా ప్రతిభ పురస్కారాల కమిటీ చైర్‌పర్సన్ బోయపాటి రామలక్ష్మి, పూర్వపు అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు, డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కటారి కాశీ విశ్వనాథరాజు, సభ్యులు అడ్డగర్ల వెంకటేశ్వరరావు స్థానికులు పాల్గొన్నారు

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాల విత్తనాల సాగు ద్వారా భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం వల్ల భూమి నిస్సారంగా మారుతుందన్నారు. భూమిలో ఉండవలసిన సూక్ష్మ పోషకాలు నశిస్తున్నాయన్నారు. ప్రతి రైతు భూసారాన్ని పెంపొందించడానికి పచ్చిరొట్ట, నవధాన్యాలు విత్తనాలను సాగు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా 80 శాతం రాయితీపై కిసాన్ డ్రోన్లను అందజేస్తున్నాయని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. తొలుత సార్వా సాగు సన్నాహకం, విత్తన మార్పిడి ఆవశ్యకతను రైతులకు వివరించారు. గ్రామ సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏఈవో డి.విద్యాసాగర్, వ్యవసాయ సహాయకులు ఆర్. స్నేహ, ఎంపీఎస్. రామాంజనేయులు, నాయకులు మద్దుకూరి ధనరాజు, అభ్యుదయ రైతులు, రైతులు పాల్గొన్నారు.

19న భీమవరం డీఎన్నార్‌లో యోగా ప్రదర్శన



యోగా ప్రదర్శనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఈనెల 19వ తేదిన ఐదువేల మందితో భారీ యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. మంగళవారం డీఎన్నార్ కళాశాల ఆవరణలోని గన్నాబత్తుల క్రీడా మైదానాన్ని పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగప్రదర్శనను విష్ణు కళాశాల నుంచి డీఎన్నార్ కళాశాలకు మార్పు చేసినట్లు తెలిపారు. యోగ అభ్యసన కార్యక్రమంలో అథ్లెటిక్స్, స్పోర్ట్స్ గ్రూప్స్, యూత్ పాల్గొంటారని తెలిపారు.ఈనెల 21న అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా 19న మెగా యోగ ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగ అభ్యాసనాలను నిర్వహించేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లను త్వరితగతి పూర్తి చేయాలని అధికారులను నాగరాణి ఆదేశించారు. ఆమె వెంట జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ రాంబాబు తదితరులున్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ దందాపై పోరుబాట

నరసాపురం: ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారం అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా స్కూల్స్‌లోనే పుస్తకాలు విక్రయిస్తూ వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని పట్టణ పౌరుల సంక్షేసంఘం కన్వీనర్ ముచ్చర్ల త్రిమూర్తులు, విద్యార్థులు తల్లితండ్రుల కమిటి కన్వీనర్ సీహెచ్ రాజేష్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థల అక్రమ దందాను అరికట్టాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల విద్యా వ్యాపారాన్ని అరికట్టడానికి ఉద్యమ కార్యాచరణ కోసం బుధవారం మొగల్తూరు రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అఖండ అన్న సమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: గ్రామంలో గరువు రజక వీధిలో ఉన్న శ్రీ నీలమ్మ వారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలా త్రిపుర సుందరీదేవికి వెండి సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని బలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి మంగళవారం దాతలు 100 గ్రాముల వెండిని విరాళాలు అందించారు. కాళ్ల మండలం ఏలూరుపాడు చెందిన తలగళ్ల వెంకటేశ్వరరావు, ఝాన్సీ దంపతులు వారి కుమార్తె జోహిత వల్లి 100 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు. ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలకు పూజలు చేసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తత అవసరం



తణుకులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: సీజనల్‌గా వచ్చే జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని టి.వేమవరం, జయంతి కాలనీలో మంగళవారం మలేరియా నివారణా మాసోత్సవం అవగాహన కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ డిసీజెస్ పట్ల అవగాహన కలిగి ఆచరణాత్మకంగా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, దోమకాటు వలన రావడానికి అవకాశం ఉన్న మలేరియా, చికున్ గున్యా, జలజనిత, శుభ్రత పాటించక పోవడం వలన రావడానికి అవకాశం ఉన్న డయేరియా, టైఫాయిడ్, జాండిస్ మొదలగు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం అత్యుత్తమ విధానమని స్పష్టం చేశారు. ప్రతి రోజూ ఇంటి ఆవరణను చెక్ చేసుకోవడం, స్తబ్దతతో కూడిన నీటినిల్వల తొలగింపుతో పాటు శుభ్రం చేసుకోవడం, నీటిని నిల్వ పెట్టుకునే పాత్రలపై విధిగా మూతలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.బేబీ కుమారి, బి.శిరీష పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అత్తిలి: ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 307 వేతనం ఎక్కడా అమలు కావడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు అన్నారు. అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో పనిచేస్తున్న కూలీలను మంగళవారం కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కూలీ రూ.307 తమకు రావడం లేదని, దాదాపు 10 వారాలకు పైగా చేసిన పనికి బకాయిలు ఉంటే కేవలం వారం రోజులకే అకౌంట్లో జమ చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వంద రోజులు పని 150 రోజులకు పెంచాలని పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రూ. 437 కూలీ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి హైమ, చిన్నమిల్లి శ్రావణి, కటికితల మౌనిక, ఉప్పల పండు, గొల్లపల్లి రమేష్, అడ్డగర్ల వెంకట రాధాకష్ణ, విస్సంశెట్టి అప్పలనాయుడు, పొలు పాల్గొన్నారు.

హైవే ఆక్రమణలతో రోడ్డు ప్రమాదాలు



హైవే ఆక్రమణలతో రోడ్డుపైనే వర్షపునీరు నిలిచిన దృశ్యం

ఉండి: హైవే రోడ్డు నంబర్ 165 (పీపీ రోడ్డు) పాలకొల్లు నుంచి పామర్రు వరకు ఉండే ఈ రోడ్డు ప్రయాణికులు, వాహనదారుల పాలిట శాపంగా మారింది. ముఖ్యంగా ఈ రోడ్డు వెంబడి ఆక్రమణలతో వర్షపు నీరు వెళ్లే దారిలేక ప్రమాదాలు పెరుగుతున్నాయి. రోడ్డు ఆక్రమించి మార్జిన్లు కూడా ఆక్రమించి పూడ్చేస్తున్నా, చెట్లు నరికేస్తున్నా గానీ వాటిపైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఎన్నో ఏళ్ల నుండి రోడ్డు ప్రక్కనే వున్న నిద్రగన్నేరు, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే కొబ్బరిచెట్లు వంటివి నరికేస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదనే చెప్పాలి. అంతేకాకుండా రోడ్డు మార్జిన్‌ల ఆక్రమణల వల్ల వర్షపునీరు రోడ్డుపైనే నిలిచి రోడ్డు పాడవుతుంది. రోడ్డు నిర్మించినా లేదా ప్యాచ్ వర్కులు చేసినా ఒకటి లేదా రెండు రోజుల్లోనే రోడ్డు పాడవుతుందంటే దానికి కారణం ఆక్రమణలే అని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రోడ్డు పక్కనవుంటే మార్జిన్లు కూడా గుంతలుగా ఉండడం, వాటిలో నీరు నిలిచిపోవడంతో ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనదారులు ఎన్నోసార్లు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎదురుగా వస్తున్న భారీ వాహనాల నుండి తప్పించుకునేందుకు మార్జిన్ దిగితే ఇక వారి సంగతి అంతే అన్నట్టుంది హైవే పరిస్థితి.

అధ్వానంగా హైవే

భీమవం నుంచి ఉండి, ఆకివీడు మండలాల పరిధిలో అయితే వాహనదారుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. రోడ్డు గుంతలమయం కావడం, మార్జిన్‌లో ఎక్కువ శాతం మట్టి ఉండటంతో వాహనదారుల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. పేరుకే హైవే గానీ రోడ్డు చాలా దారుణమైన పరిస్థితిలో ఉంది. షోరూంల వారు ఆక్రమణలు చేసి వారి ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టినా, డ్రెయినేజ్ సౌకర్యం లేకుండా పూడ్చివేసినా అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు రోడ్డుపై ఉండే నీటిలోనే వాహనాలు నడపాల్సిన పరిస్థితి తలెత్తింది. రోడ్డు పాడవునా ఉండే దుకాణాలు, షోరూంలు, ప్రజలు రోడ్డుకంటే ఎత్తుగా తమ స్థలాలు పూడ్చుకోవడంతో రోడ్డుపైకి మట్టి చేరుకుని వర్షపు చినుకుపడితే చాలా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల హైవే రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేసిన ఓ షాపు ముందు, ఇప్పుడిప్పుడే నిర్మాణం జరుగుతున్న షోరూం వద్ద కొబ్బరి చెట్లను ఇష్టానుసారం నరికివేస్తున్నా అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదో? లేదా వారికి అనుమతులిచ్చేసారో తెలిడం లేదంటూ వాహనదారులు వాపోతున్నారు. ఆదాయంతో పాటు నీడనిచ్చే చెట్లను ఇలా నరికివేస్తే ఏంటి పరిస్థితి అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనదారుల ప్రాణాలంటే లెక్కలేదు



హైవేపై ప్రమాదాలు నిత్య కృత్యంలా మారాయి. ఆకివీడు నుంచి ఉండి, భీమవరం పరిధిలో ప్రతి రోజూ ఏదో ప్రమాదం చోటు చేసుకుంటుంది. దీనివల్ల ఎంతో మంది వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది నిజంగా వాహనదారుల తప్పా లేక ఆక్రమణలు జరుగుతున్నా, హైవేపై సమస్యలు వున్నా పట్టించుకోని అధికారులదా? ప్రాణం పోతే తిరిగిరాదు.అయితే అధికాస్త నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు పోకూడదు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి.

– పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, వాండ్రం

రోడ్డు మార్జిన్లు సరి చేయాలి



ఏదో సందర్భంగా పొక్లెయన్‌ల సహాయంతో రోడ్ల పక్కనే వుండే చెత్తా చెదారం తొలగిస్తున్నారు తప్ప రోడ్డు మార్జిన్లలోవుండే మట్టిని మాత్రం తొలగించడం లేదు. హైవే మార్జిన్ దిగితే కనీసం కంకర వుండాలి. మార్జిన్‌లో ఏం ఉంటుందో అధికారులు పరిశీలిస్తే మంచిది. ప్రజల ప్రాణాలకు అధికారులను బాధ్యులను చేయాలి. అప్పుడే వారు సరైన చర్యలు తీసుకుంటారు.

– దానం విద్యాసాగర్, న్యాయవాది, పాములపర్రు